بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 06.12.2019 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప అభిమాని అయిన అనుచరుల సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 06.12.2019 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. నేడు నేను ప్రస్తావించనున్న బద్రి అనుచరులలో మొదటి అనుచరుని పేరు హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్యహ్. హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్యహ్ ఆరంభములోనే ఇస్లాం స్వీకరించిరి. హజ్రత్ హిలాల్ తబూక్ యుద్ధములో పాల్గొనలేక పోయిరి. ఎలాంటి సముచితమైన సాకు లేకుండానే తబూక్‌లో పాల్గొనని ముగ్గురు అనుచరులలో వీరొకరు. రెండవ అనుచరులు కాబ్ బిన్ మాలిక్ (మూడవ అనుచరులు) మురారహ్ బిన్ రబీ. వీరి గురించి పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఈ సూక్తి కూడ అవతరించినది. --- (అత్తౌబహ్:118) అనగా వెనుకకు వదలివేసిన ఆ ముగ్గురుని కూడ (అల్లాహ్ క్షమించుచు అనుగ్రహించెను.) భూమి విశాలముగా నున్నను వారి కొరకు ఇరుకుగా అయినప్పుడు వారి ప్రాణములు ఇరుకాటముననుభవించినప్పుడు, అల్లాహ్ తప్ప మరెక్కడా శరణము లభించదని వారు భావించినప్పుడు, వారు క్షమాపణ కోరవలయునని వారిని మన్నిచిచు అనుగ్రహించెను. నిశ్చయముగా క్షమాగుణ ప్రపూర్ణుడే అల్లాహ్, పరమ కారుణ్యమూర్తి.

తబూక్ యుద్ధము హిజ్రి 9వ సం॥లో సంభవించినది. ఈ ముగ్గురు అనుచరులు వెనుక బడిన విషయము సహీ బుఖారిలోని ఒక కథనములో వివరంగా కూడ ప్రస్తావించబడెను. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ మనుమడు అబ్దుర్రహ్మాన్ తన తండ్రి అబ్దుల్లాహ్ బిన్ కాబ్ ద్వారా హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ ఇట్లు తెలిపిరని ఉల్లేఖించిరి. ఒక్క తబూక్ యుద్ధము తప్ప రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్ళిన ఏ యుద్ధములో కూడ నేను వెనుకబడి పోలేదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖురైష్ బృందమును నిలువరించు ఉద్దేశ్యముతో బయలు దేరిరి. కాని అల్లాహ్ తఆలా వారిని శత్రువుతో ఎదురింప జేసెను. అప్పుడు నా పరిస్థితి ఎంతో ఆనందము, ఎన్నో వసతులతో కూడి యుండెను. అప్పుడే నేను తబూక్ యుద్ధములో పాల్గొనలేక పోతిని. ఇంతకు ముందెన్నడు నా దగ్గర సవారి చేయుటకు రెండు ఒంటెలు లేకుండెను. తీవ్ర వేసవి కాలములో నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధము కొరకు బయలుదేరిరి. సుదూర ప్రయాణము, నిర్మానుష్యమైన వనములో సంఖ్యలో అధికమైన శత్రువుతో వారు పోరాడవలసి యుండెను. అన్ని విధాల దాడులకు సన్నాహాలు చేసుకోవాలని వారి పరిస్థితిని ముస్లిములకు వారు స్పష్టముగా తెలియజేసిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, ఇతర ముస్లిములు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవడం మొదలు పెట్టిరి. ప్రయాణము కొరకు సన్నాహాలు చేసుకోవాలని ఉదయము పూట నేను కూడ వారితో బయలు దేరేవాడిని కాని ఏమి చేసుకోకుండానే తిరిగి వచ్చేసెవాడిని. అన్ని వనరులు నా వద్ద ఉన్నందున నేను త్వరగా సిద్ధము కావచ్చునని భావించే వాడిని. ఇదే ఆలోచన నన్ను వెనుకబడేసెను. తుదకు ప్రజలు సన్నద్ధమైనందున ఒకరోజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉదయము పయనమైరి. వారితో పాటు ముస్లిములు కూడ బయలు దేరిరి. కాని ప్రయాణము కొరకు నేనెలాంటి సన్నాహాలు చేసుకోలేదు. వారు బయలుదేరిన ఒకట్రెండు రోజుల తర్వాత నేను సిద్ధమై వారి వద్దకు చేరుకోగలనని నేను భావించితిని. ఇలా నేను సన్నద్ధము కాక వుండిపోతిని. కాని సైన్యము వేగంగా ప్రయాణిస్తు చాలా ముందుకు వెళ్ళి పోయెను. తబూక్ చేరుకోక ముందు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను గుర్తు చేయలేదు. తబూక్‌లో అనుచరుల మధ్య కూర్చొని ఉండగా కాబ్ ఏడి? అని వారు సల్లల్లాహు అలైహి వసల్లం అడిగిరి. బనూ సల్మాలోని ఒక వ్యక్తి ఓ రసూలుల్లాహ్ అతనిని ధనము, గర్వము ఆపివేసెనని అనెను. హజ్రత్ మఆజ్ బిన్ జబల్ ఇది విని ఇట్లనిరి. ఓ

రసూలుల్లాహ్ అతని గురించి మాకు మంచి అనుభవమే ఉన్నది. అతనిలో గర్వము, అహంకారము, దాంబికము లేదు. ఇది విని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మౌనము దాల్చిరి. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ ఇట్లనిరి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి వస్తున్నట్లు నాకు తెలిసినది. అప్పుడు నేను ఆందోళనకు గురై వారి ఆగ్రహముతో తప్పించుకొనుటకు నేను అసత్య మాటలు ఆలోచించసాగితిని. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చేరుకున్న తర్వాత అసత్య ఆలోచనలన్ని నా మనసు నుండి దూరమైనవి. అబద్ధము చెప్పి నేను వారి ఆగ్రహముతో తప్పించుకోలేనని తెలుసుకొంటిని. కావున నేను అన్ని విషయములు సత్యమే పలుకుటకు సిద్ధమైతిని. వారు మస్జిద్‌నకు వచ్చినప్పుడు వెనుకబడిపోయిన వారందరు వచ్చి వివిధ సాకులు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి బాహ్య సాకులను విని వారితో మరల బైఅత్ తీసుకొనిరి. వారి కొరకు పశ్చత్తాపము చేసిరి. వారి అంతర్గతమును అల్లాహ్‌కే వదిలి వేసిరి. అనంతరం నేను వారి సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొంటిని. నేను సలాం చేయగా వారు బదులిచ్చి ఆగ్రహముతో వున్న వ్యక్తి నవ్వినట్లు నవ్విరి. ముందుకు రమ్మని వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. నేను ముందుకు వెళ్ళి వారి సమీపములో కూర్చొంటిని. ఎందుకు నువ్వు రాలేదు, నువ్వు సవారి కొరకు పశువు కొనలేదా? అని వారు నన్ను అగిడిరి. నేనిట్లంటిని. అల్లాహ్ ప్రమాణముగా! మీరు కాక మరొక వ్యక్తి ముందు నేనున్నచో అసత్యము చెప్పి అతని ఆగ్రహముతో నేను తప్పక తప్పించుకొనే వాడిని. కాని అల్లాహ్ ప్రమాణముగా! నేడు నేను ఏదో ఒక అబద్ధము చెప్పి మీ ఆగ్రహము నుండి తప్పించుకున్నను సమీపములోనే అల్లాహ్ తఆలా మీకు నాపై ఆగ్రహము కల్పించునని నేను నమ్ముతాను. కావున నేను సత్యమే పలుకుతాను, తద్వారా మీరు నాపై కోపగించుకొన్నను అల్లాహ్ తఆలా నన్ను క్షమించునని నేను నమ్ముతున్నాను. అనంతరము హజ్రత్ కాబ్ ఇట్లు వేడుకొనిరి. అల్లాహ్ ప్రమాణముగా నాకెలాంటి ఇబ్బంది లేకుండెను. నేను మీతో వెనుక బడి పోయినప్పుడు ఆనందము, సంతోషముగా ఉన్నంతగా నేనంతకు ముందు ఎన్నడు లేకుంటిని. ఇది విని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇతడు సత్యము చెప్పెనని అనిరి. అల్లాహ్ తఆలా నీ గురించి నిర్ణయము తెలిపేంత వరకు నువ్వు వేచి చూడమని అనిరి. కావున నేను అక్కడి నుండి వెళ్ళిపోతిని. బనూ సల్మా లోని కొందరు నా వెనుక వచ్చి నాతో ఇట్లన సాగిరి. నువ్వు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందట ఏదో ఒక సాకు కూడ చెప్పలేక పోతివా. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నీ కొరకు పశ్చత్తాపము చేయుట నీ పాప క్షమాపణకు సరిపోయేది. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ముందట నా వలె ఒప్పుకున్నవారు మరెవరైనా వున్నారా అని నేను వారినడిగితిని. వారిట్లనిరి అవును ఇంకో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. నీకు లభించిన సమాధనామే వారికి లభించినది. వారెవరని నేనంటిని. వారిట్లనిరి ఒకరు మురార బిన్ రబీ ఉమ్రి కాగ మరొకరు హిలాల్ బిన్ ఉమయ్యా వాఖిఫి. హజ్రత్ కాబ్ ఇట్లనిరి. బదర్ యుద్ధములో పాల్గొన్న ఇద్దరు సత్యవంతుల ప్రస్తావన వారు నాతో చేసిరి. వారిద్దరిలో నా కొరకు ఆదర్శముండెను. కావున నేను వారి వద్ద నుండి వెళ్ళిపోతిని. ముస్లిములు మాతో మాట్లాడకూడదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి.

ప్రజలు మాకు తెలియనట్లే మాతో దూరముండ సాగిరి. ఇంతలోనే ఒకసారి నేను మదీనా వీధులలో తిరుగు చుండగా సీరియా నుండి వచ్చిన వ్యాపారస్తులలో ఒక వ్యాపారి కాబ్ బిన్ మాలిక్ గురించి మాకు చెప్పరా అని అడుగుతున్నట్లు నేను చూచితిని. ప్రజలు నా వైపు సంజ్ఞ చేసిరి. అతడు నా వద్దకు వచ్చి ఘస్సాన్ రాజు తరఫున ఒక ఉత్తరము నాకిచ్చెను. అందులో రాసిన అంశము ఇట్లుండెను. నీ సహచరుడు నీతో కఠినముగా వ్యవహరించెనని, నిన్ను బహిష్కరించెనని నాకు సమాచారమందినది. మీరు అవమానమును ఎదుర్కొను లేదా వృధాగా వదిలి పెట్టు వంశములో అల్లాహ్ తఆలా నిన్ను పుట్టించలేదు. మీరు వచ్చి మాతో కలిసినచో మీకు సరియైన గౌరవ మర్యాదలు ఇచ్చెదము. కాబ్ ఇట్లనిరి. ఈ ఉత్తరము చదివి, ఇది కూడ ఒక పరీక్ష అని నేను భావించితిని. ఆ ఉత్తరము తీసికొని నేనొక తన్నూర్ వైపు వెళ్ళి దానిని అందులో పడవేసితిని. 50 రాత్రులలోని 40 రాత్రులు గడిచిన తరువాత నువ్వు నీ భార్యతో దూరముగా ఉండమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నాకు సందేశము పంపితిరి. ఆమెకు విడాకులు ఇవ్వవలెనా? అని నేనడిగితిని ఆమె నుండి దూరముండమని మాత్రమే అతడు సమాధాన మిచ్చెను. నా ఇద్దరు సోదరులకు కూడ వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇలాగే సమాచారమందించిరి. కావున నేను మరో 10

రాత్రులు ఇలాగే గడిపితిని. 50వ రాత్రి తరువాతి ఉదయము ఫజ్ర్ నమాజ్ తరువాత నేను నా ఇంటి పైకప్పుపై ఉండగా సలా పర్వతమెక్కి ప్రకటిస్తున్న ఒక వ్యక్తి ప్రకటనను నేను వింటిని. అతడిట్లు తెలుపుచుండెను. ఓ కాబ్ బిన్ మాలిక్ నీకు శుభవార్త! ఇది విని నేను సాష్టాంగములో పడిపోతిని. ఆపద దూరమైనదని నేను అర్థము చేసికొంటిని. ఫజ్ర్ నమాజ్ తరువాత అల్లాహ్ కరుణించి మమ్ములను క్షమించినాడని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటించిరి. ఇది విని ప్రజలు మాకు శుభవార్త తెలుపుటకు మా వైపు వస్తుండిరి. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకుంటిని. ప్రజలు తండోపతండాలుగా వచ్చి నాతో కలుస్తు పశ్చత్తాపము ఆమోదించబడినందున నాకు శుభకాంక్షలు తెలుపుచుండిరి. అల్లాహ్ మిమ్ములను కరుణించి మీ పశ్చత్తాపమును ఆమోదించినందున మీకు శుభాకాంక్షలని వారంటుండిరి. హ్రజత్ కాబ్ ఇట్లనిరి. తుదకు నేను మస్జిద్ చేరుకున్నాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చుండగా నేను చూచితిని. వారి చుట్టు ప్రజలు కూడ వుండిరి. హ్రజత్ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ నన్ను చూచి నా వద్దకు పరుగెత్తుకుంటు వచ్చి నాతో కరచాలనము చేసి నాకు శుభాకాంక్షలు తెలిపిరి. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అస్సలాము అలైకుం చెప్పగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాధానము చెప్పిరి. అప్పుడు వారి ముఖము సంతోషము వలన నిగనిగలాడుచుండెను. నిన్ను నీ తల్లి జనించి నప్పటి నుండి ఇది ఒక మంచి రోజు అయినందున నీకు శుభవార్త అని వారనిరి. ఈ శుభవార్త మీ వైపునా లేక అల్లాహ్ వైపునా? అని నేను వారినడిగితిని. అల్లాహ్ వైపుననే అని వారు సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంతోషములో ఉన్నప్పుడు చంద్రుని వలె వారి ముఖము ప్రకాశించేది. తద్వారా మేము వారి ఆనందమును గుర్తు పట్టేవారము. ఓ రసూలుల్లాహ్! ఈ పశ్చత్తాపము ఆమోదించబడినందున నేను నా సర్వ ఆస్తిపాస్తులను అల్లాహ్ అతని ప్రవక్త కొరకు దానము చేస్తున్నానని తెలిపితిని. నీ ఆస్తిలోని కొంత నీ కొరకు మిగుల్చుకొనుట నీకు మంచిదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బదులిచ్చిరి. ఖైబర్‌లోని భాగమును నా కొరకు ఉంచుకుంటున్నానని నేను వేడుకొంటిని. నేను మరల ఇట్లంటిని. ఓ దైవ ప్రవక్త! నా సత్యము వలన అల్లాహ్ నాకు మోక్షమిచ్చెను. నా పశ్చత్తాపములో భాగముగా భవిష్యత్తులో నేను జీవించి వున్నంతవరకు సత్యమే పలుకుతాను.

తబూక్ యుద్ధమునకు గల కారణమేమనగా సీరియా వ్యాపార (నబ్తీ) తెగ ప్రజలు తైలం వ్యాపారము కొరకు మదీనాలో పర్యటించేవారు. ఖైసరె రోమ్ ఒక సైన్యము ఖైసర్‌తో కలిసి సీరియా దేశములో ప్రోగు అగుచున్నదని వారి ద్వారా నబి కరీం సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిసినది. ఈ వార్త నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిసినప్పుడు ప్రజలు అచేతనంగా ఉండిరి. అయినను బయలు దేరాలని వారు సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటించిరి. సన్నాహాలు చేసుకొనుటకు వీలు కలిగేందుకు ప్రయాణించ వలసిన ప్రాంతము గురించి కూడ వారు స్పష్టము చేసిరి.

అనుచరులు ఆహమహమికతో త్యాగములు సమర్పించిరి. ప్రజలు తమ వస్తువులను ప్రోగు చేయడం మొదలు పెట్టిరి. యుద్ధములో పాల్గొనుటకు తమ గృహములలో వెతికి వస్తువులను ప్రోగు చేసిరి. కొందరు నడుచుకుంటు పాదరక్షలు లేకుండానే యుద్ధములో పాల్గొనుటకు బయలు దేరిరి. హ్రజత్ ఉమర్ (రజి) తమ అర్థ ధనమును, హ్రజత్ అబూబక్ర్ (రజి) తమ పూర్తి ధనమును ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందించిరి.

తబూక్ యుద్ధము సందర్భమున హ్రజత్ అబూబక్ర్ (రజి) అందించిన వస్తువుల విలువ నాలుగు వేల దిర్హములుండెను. ఇదే సందర్భమున హ్రజత్ ఉస్మాన్ (రజి) కూడ ఒంటెలు, అశ్వములు, నగదు సమర్పించు కొనిరి. ఈ త్యాగము వలన ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వేదికపై నిలిచి ఇట్లు ప్రకటించిరి. ఈ సత్కర్మ తరువాత ఇక ముందు ఉస్మాన్ చేసిన ఏ పని గురించి ప్రశ్నించబడదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మరో అనుచరులు అబూ ఉఖైల్ (రజి) వుండిరి. యుద్ధములో ఇచ్చుటకు వారి వద్ద ఏమియును లేకుండెను. కావున వారికొక ఆలోచన వచ్చెను. ఒక రోజు రాత్రి ఒకరి పంటకు నీళ్ళు పారించి అతనిచే లభించిన కూలి డబ్బులను సమిర్పించుకోవాలని రాత్రంత వారు మోటతో బావిలో నుండి నీళ్ళు తీసి పంటను పారించిరి. కూలీగా వారికి రెండు సేర్లు అనగా సుమారు నాలుగైదు కిలోల ఖర్జురములు లభించెను.

వాటిలోని సగము వారు తమ భార్యాపిల్లలకు ఉంచుకొని మిగితా సగమును తీసుకొని అల్లాహ్ తఆలా మార్గములో సమర్పించు కొనుటకు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చిరి.

ఈ సందర్భమున హ్రజత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవూఫ్ (రజి) తమ అర్ధ ధనమును ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందించిరి. దాని విలువ నాలుగు వేల నాలుగు వందల దిర్హములుండెను. హ్రజత్ ఆసిం బిన్ అది (రజి) వంద వస్క్ ఖర్జూరములు అందించినప్పుడు ఇది దర్శన నిమిత్తమని దాంబికులు ఆరోపణ చేసిరి. అప్పుడు అల్లాహ్ తఆలా ఈ సూక్తిని అవతరింప జేసెను. --- (అత్తౌబహ్: సూక్తి 79) అనగా సంతోషముతో ముందుకు వచ్చి దానములు చేయు విశ్వాసులను హేళన చేయువారు వీరే. (దాంబికులే) తమ స్వంతార్జితము తప్ప ఏ శక్తి లేని వారిని కూడ వారు పరిహసింతురు. త్యాగము చేసినను వారిని వీరు పరిహపింతురు. అల్లాహ్ వారితో వైరుధ్యము గల వారికి పరిహాస శిక్ష విధించును. వారికి దుఃఖకరమైన శిక్ష విధించబడును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హ్రజత్ హిలాల్ బిన్ ఉమయ్యా గురించి ప్రస్తావించ వలసిన మరికొన్ని విషయములున్నవి. అవి ఇన్షా అల్లాహ్ తఆలా తరువాత ప్రస్తావించబడును.

వఖ్ఫె నౌ విభాగము తరఫున ఒక ప్రకటన కూడ ఉన్నది. వారొక వఖ్ఫెనౌ వెబ్ సైట్ waqfenauintl.org పేరున సిద్ధము చేసిరి. అది ఇన్షా అల్లాహ్ నేడు ప్రారంభించబడును. వాఖిఫీనె నౌ (జీవిత సమర్పితులు), జీవిత సమర్పితుల తల్లిదండ్రులు తప్పకుండా దీనిని సద్వినియోగం చేసుకోండి.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |